కథ

# తూరుపు వెళ్ళే రైలు

ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి

**"దయచేసి వినండి. విజయవాడ నుండి విశాఖపట్టణం వెళ్ళు రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ మూడవ నంబరు ప్లాట్‌ఫారం నుండి బయల్దేరుటకు సిద్ధంగా ఉన్నది".**

**"బండికదిలిపోద్ది. బేగీ ఎక్కు". కూతుర్ని పెట్టెలోకి గెంటి తనూ ఆయాస పడుతూ ఎక్కింది ఆదెమ్మ. మరుక్షణంలోనే కూత వేసుకుంటూ రాజమండ్రి స్టేషన్ ప్లాట్‌ఫాం నుండి బయల్దేరింది రత్నాచల్ ఎక్స్‌ప్రెస్.**

**పెళ్ళిళ్ళ సీజన్ అవడం వలన అన్నిపెట్టెలూ జనంతో కిటకిటలాడుతూ వున్నాయి. ఆదెమ్మ ఎక్కిన పెట్టెకూడా ప్రయాణికులతో, లగేజీతో అడుగు తీసి అడుగు వేయటానికి వీలు లేనట్టుగా వుంది.**

వెలిసిపోయిన చీర, చంకలో జోలెతో నల్లగా వున్న ఆదెమ్మని పెట్టెలోని ప్రయాణీకులు ఛీత్కారంగా చూడసాగారు.

ఇవేమీ పట్టించుకోని ఆదెమ్మ కూతురి చేయి పట్టుకొని జనం మధ్యలో నుండి దారి చేసుకుంటూ పద్మవ్యూహం లాంటి ఆ పెట్టెలో నుండి రిజర్వేషన్ పెట్టెలోకి వచ్చింది.

కూతుర్ని బాత్‌రూంలోకి తీసుకెళ్ళి చీరకట్టి, నుదుటిన కళ్యాణ తిలకం, బుగ్గున చుక్కపెట్టి పెళ్ళి కూతురిలా ముస్తాబుచేసింది. వెంకటలక్ష్మి మౌనంగా తల్లిచేసే అలంకరణకు తలఒగ్గి నిల్చుంది. బాత్‌రూంలోని అద్దంలో తన ప్రతిబింబం చూసుకున్న వెంకటలక్ష్మి చిన్నగా సిగ్గుపడింది.

కూతురివాలకం చూసి ఆదెమ్మ "చాల్లే సంబడం. నీ సిగ్గు సివాచలం సంతకెళ్ళినట్టుంది" అని సున్నితంగా మందలించీ బాత్‌రూం నుండి బయటకొచ్చింది.

రైలు ద్వారపూడి దాటింది. రైల్లో నుండీ ద్వారపూడి దేవాలయంలోని దేవుళ్ళకు దణ్ణాలు పెట్టుకున్నారు ప్రయాణీకులు.

"బాబూ తండ్రిలేని బిడ్డ. వచ్చేవారమే దీని పెళ్ళి. ధర్మం చెయ్యండి బాబూ".

ప్రయాణీకుల సీట్ల మధ్య నిలబడి దణ్ణాలు పెడుతూ, వారి కాళ్ళకు మొక్కుతోంది ఆదెమ్మ.

పదిహేను, పదహారేళ్ళ వయసులో నల్లగా వున్నా ఆరోగ్యంగా తీర్చిదిద్ది నట్టున్న వెంకటలక్ష్మిని కన్నార్పకుండా చూస్తున్నారు కుర్రాళ్ళు.

ముసలి వారు, నడి వయసు వారూ పెళ్ళి అంటోంది కదా రూపాయో, రెండోయిస్తే బాగుండదని అయిదో, పదో ఆదెమ్మ చేతిలో పెడుతున్నారు.

జీను ఫాంట్లు, టీ షర్టులు వేసుకున్న కుర్రాళ్ళ దగ్గరకొచ్చి కూతురి పెళ్ళికి సాయం చేయమని ప్రాధేయపడింది ఆదెమ్మ.

నల్లవిరుగుడు కర్రతో చెక్కిన దారుశిల్పంలా వున్న వెంకటలక్ష్మిని చూసి అబ్బురపడ్డాడు భరద్వాజ్. బ్లాక్‌బ్యూటీ అనుకున్నాడు తనలో తనే. పర్సుతీసి వందరూపాయల నోటు ఆమెకిచ్చాడు.

ఒక్కసారిగా కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి ఆదెమ్మకు. చటుక్కున ఒంగుని అతని కాళ్ళు పట్టుకోబోయింది.

కాళ్ళు వెనక్కి తీసుకొని వారించాడు భరద్వాజ్.

"తప్పమ్మా! వయసులో పెద్దదానివి. పిల్లల కాళ్లకి మొక్కకూడదు. ఆ భగవంతుడికి మొక్కు. మంచి జరుగుతుంది".

భరద్వాజ్ సీటుకి ఎదురుగా వున్న నడి వయసాయన "అపాత్ర దానం చేసావయ్యా" అని అన్నాడు.

"అంటే?" ప్రశ్నించాడు భరద్వాజ్.

"ఆమె ఆ అమ్మాయికి పెళ్ళి ఇప్పుడప్పుడే చెయ్యదు. యాచనకి ఇదో మార్గం. మేం తరచూ ఇదేరైల్లో చూస్తూనే వుంటాం వాళ్ళని ఇదే మేకప్పుతో" వ్యంగ్యంగా అన్నాడాయన.

"పోనిద్దురూ. మేం సిటీలో సినిమాకు వెళితే వంద రూపాయలవుతాయి. అలా ఖర్చయ్యాయని అనుకుంటాం" అన్నాడు భరద్వాజ్.

అతని సమాధానానికి అసహనంగా మొహం తిప్పుకున్నాడు పెద్దాయన.

మధ్యాహ్నం పన్నెండున్నరకు విశాఖ చేరుకుంది రత్నాచల్.

టి.సి. వెనకాల బిక్కుబిక్కుమంటూ వెళ్ళారు ఆదెమ్మ, వెంకటలక్ష్మి.

టి.సి. రూమ్‌లోకి వెళ్ళి కూర్చుని ఆదెమ్మ కేసి తిరిగాడు.

"ఎన్నిసార్లు చెప్పినా నువ్వు టిక్కెట్టు తీసుకోవు. రిజర్వు కంపార్టుమెంట్లో ఎక్కి డిస్టర్బ్ చేస్తున్నావని ఫిర్యాదులు వస్తున్నాయి. లాభం లేదు. నిన్ను జైల్లో పడేయిస్తేనే గానీ బుద్ధిరాదు".


టి.సి. కంప్లయింట్ రాయడానికి పేపరు చేతిలోకి తీసుకోగానే ఆయన కాళ్ళ మీద పడిపోయింది ఆదెమ్మ.

"బాబూ! ఈసారికి వదిలేయండి బాబూ. రేపట్నుంచి టిక్కెట్టు తీసు కుంటాను. ఈ పిల్లకి పెళ్ళి చేసేస్తే నా బరువు దిగిపోతాది. ఆ పైన ఏదో పని చేసుకొని బతుకుతాను. పెద్ద మనసు చేసుకొని నన్నూ నా బిడ్డను దయచూడండి బాబూ! జన్మంతా మీకు ఋణపడి వుంటాను.

"సర్లే! ఇవాళ కలెక్షన్ ఎంత?" వ్యంగ్యంగా అడిగాడు టిసి.

"రెండు వందలు బాబూ. ఈ వంద తీసుకొని మమ్మల్ని వదిలేయండి బాబూ!" వంద రూపాయలు టి.సి. కివ్వబోయింది.

"దొంగముండకానా, నేను నీ కళ్ళకి 'ఎదవ'లా



కన్పిస్తున్నానా? స్టూడెంట్ కుర్రాళ్ళ దగ్గర నువ్వు మూడు వందలు పట్టేయడం నేను చూడ లేదనుకున్నావా? అన్నవరం వెళ్తున్న కొత్త పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకు రెండు వందలు ఇవ్వలేదా? అనకొండలా వెయ్యి రూపాయలు చడీ చప్పుడు లేకుండా నొక్కేసి నాతోటి పరాచికాలాడుతున్నావా? తియ్, బొడ్లో సంచీలోంచి, జాకెట్లో దాచినవి తియ్! ముండకానా''.

ఉగ్రనరసింహుడై బండబూతులు తిట్టసాగాడు టి.సి.

తన కష్టమంతా ఈ వేళ వీడి మొఖాన కొట్టాల్సిందేనా అని ఆలోచిస్తున్న ఆదెమ్మ నడుం మీద టి.సి. చెయ్యిపడగానే, ఉలిక్కిపడి గబగబా రొంటిని దోపుకున్న డబ్బులు, జాకెట్లో చిన్నపర్సులో దాచుకున్న వందనోట్లు అన్నీ తీసి టేబుల్ మీద పెట్టింది.

టి.సి. డబ్బులన్నీ లెక్కపెట్టాడు. పన్నెండు వందల యాభై రూపాయిలున్నాయి.

''ఏమే దొంగముండకానా! పన్నెండు వందలు బొడ్లో దోపేసుకుని, 'కలెక్షన్ ఎంత?' అని నే అడిగితే 'రెండు వందలు బాబయ్యా' అని చెబుతావా?

ఎంత నంగనాచివే? నీలాంటి వారి వల్లే మాకు నష్టాలు వస్తున్నాయి. తల్లిదగ్గరే యింతవుంటే, పిల్ల దగ్గర ఎంతవుందో? తియ్‌మను దాని దగ్గరున్న డబ్బు కూడా'' రంకెలు వేసాడు టి.సి.

''లేదు బాబు! దాని దగ్గర ఏం దాచలేదు. చిన్న పిల్ల కదాని నా దగ్గరే దాచుకున్నాను''.

''అది చిన్న పిల్లేంటే, వయసొచ్చి పిటపిటలాడి పోతుంటే! నా కళ్ళకేమైనా చత్వారమొచ్చిందనుకున్నావా? నేనే చెక్ చేస్తానుండు'' క్రూరంగా నవ్వుతూ కుర్చీలోంచి లేచాడు టి.సి.

పులి గాండ్రింపుకి భయపడిన లేడిపిల్లలా గజ గజ వణికిపోయింది వెంకటలక్ష్మి. ఆదెమ్మ కూతురికి, టిసికి మధ్యగా నిలబడి కన్నీళ్ళు కారుస్తూ వేడుకొంది.

''బాబూ! నా మాటనమ్మండి. దాని దగ్గర నయా పైసా కూడా దాచలేదు. ఈ డబ్బంతా మీరే తీసుకోండి. నన్నూ, నా బిడ్డని వదిలెయ్యండి''.

అదే సమయంలో గదిలోకి ఎవరో వస్తున్న అలికిడి అవడంతో టి.సి. వెనక్కి వచ్చి టేబుల్ మీది డబ్బు తన బ్యాగ్‌లో వేసుకున్నాడు.

''ఫోండి. ఇంక ఎప్పుడూ టికెట్ లేకుండా బండెక్కకండి'' అని తల్లీ, కూతురికి తాత్కాలిక విముక్తి కల్గించాడు టి.సి.

'చెకింగ్' పేరుతో నల్లసుందరిని ఒళ్లంతా 'తడిమే' అదృష్టం చేజారి పోయిందని అప్పుడే రూంలోకి అడుగు పెట్టిన కొలీగ్‌పై చిరాకు పడ్డాడు టి.సి.

మునిసిపల్ డ్రైనేజీలా దుర్గంధం వెదజల్లే అతని 'మనసు' తెలిసిన కొలీగ్ అదేం పట్టించుకోకుండా డ్రాయర్ సొరుగులో వున్న కోటు తీసుకొని భుజాన వేసుకొని బయటికెళ్ళిపోయాడు.

***

అతి భద్రంగా కొప్పులో దాచుకున్న ఇరవై రూపాయల నోటుని బయటకు తీసి రెండు ఇడ్లీలు పొట్లాలు కొంది ఆదెమ్మ. ఇద్దరూ స్టేషన్‌చివరగా వున్న చెట్టుకింద చేరి ఇడ్లీలు తిని, కడుపునిండా కుళాయి నీళ్ళు తాగారు.

ఎన్నడూ లేనిది ఈ వేళ దేవుడి దయవలన నాలుగుడబ్బులు దండిగా వచ్చాయనుకుంటే రాబందులా తన్నుకుపోయాడు ఆ టి.సి. నల్లగా అడవి దున్నలా వుండే ఆ టి.సి. అంటే అందరికీ హడలే. సామర్లకోటలో సమోసాలమ్మే సత్తిగాడు అన్నాడోసారి తనతో.

''అక్కా! నీ పిల్లని మాత్రం ఆడికంట పడనీకు. సానా దుర్మార్గుడు. కంటపడిన డబ్బునే కాదు కన్నేసిన ఆడదాన్నీ వదిలే రకం కాదు. ఈ లైన్లో కలెక్షన్ బాగుంటాదని బదిలీ ఆపుకుంటూ వస్తున్నాడు. జాగ్రత్త అక్కా''.

తనకి ఒక కాలుపోలియో. కుటుంబ భారం మోయలేక మొగుడు నాలుగేళ్ళ కిందటే దేశాలట్టి పోయాడు. అక్కడా, ఇక్కడా పాచి పని చేసే వారు తనూ, వెంకటలక్ష్మి. కానీ పనిచేసే ఇళ్ళల్లోని మగాళ్ళ కళ్ళన్నీ కూతురి మీదే వుండి, తను గిన్నెలు తోముతుంటే గదులు ఊడవాలని, బాత్‌రూంలో నీళ్ళు పెట్టమని పిలిచి పరాచికాలాడటం సాగించడంతో ఆ పని మిరమించుకొంది.

పోలియో కాలు వలన కూలి పనుల కెళ్ళడం కష్టంగా వుండేది.

చివరికి యాచకవృత్తి చేపట్టింది. పెళ్ళిళ్ళ సీజన్‌లో కూతురికి పెళ్ళికూతురి వేషం వేసి నాలుగు డబ్బులు పోగేసి పోస్టాఫీసులో దాస్తోంది. ఇప్పటికి ఎనిమిది వేలయ్యాయి. ఇంకో రెండు వేలు వచ్చాకా ఆ పది వేలతో నర్సింహ కిచ్చి పెళ్ళి చేసెయ్యాలి. తన బాధ్యత తీరిపోతే తాను ఎక్కడో అక్కడ కాలక్షేపం చేస్తుంది.

నర్సింహకి వెంకటలక్ష్మి అంటే చాలా యిష్టం. రైళ్ళలో తిరుగుతూ పల్లీలు, బఠానీలు అమ్ముతూ వుంటాడు. రోజూ కనీసం నూట ఏభై రూపాయలు సంపాదిస్తాడు. అతనికిచ్చి పెళ్ళిచేస్తే లక్ష్మీ సుఖపడుతుంది.

దుర్మార్గుడైన ఈ టి.సికి బుద్ధి చెప్పాలి.

తన వంటిమీద చెయ్యి వెయ్యడానికి ఎవరూ సాహసించలేదు. అటు వంటిది తన నడుం మీద చెయ్యి వేసి డబ్బులు సంచీ వెదుకుతాడా?

ఆ సంఘటన తలుచుకోగానే ఆమెకి కోపం, కసీ కళ్ళలో కదలాడాయి.

తల్లిని అలా చూడగానే వెంకటలక్ష్మికి భయం వేసింది.

''అమ్మా! అమ్మా!'' అంటూ తల్లిని కుదిపింది.

ఆలోచనాలోకం నుండి వాస్తవం లోకి వచ్చింది ఆదెమ్మ. ''తిరుమల ఎక్స్‌ప్రెస్ ఆరవ నెంబర్ ఫ్లాట్ ఫారం నుండి బయలుదేరడానికి సిద్ధంగా వుంద'న్న ఎనౌన్స్‌మెంట్ వినగానే వెంకటలక్ష్మిని తీసుకొని గబగబా వచ్చి తిరుమల బండెక్కింది ఆదెమ్మ.

యధాప్రకారంగా బోగీలు తిరుగుతూ కూతురి పెళ్ళికి సాయం చేయమని అడిగింది. నాలుగు బోగీలు తిరిగినా నలభై రూపాయలకన్నా సాయం అందలేదు. నిరాసక్తంగా ఒకబోగీలో కూర్చుండిపోయి రాజమండ్రి రాగానే దిగిపోయారిద్దరూ. ఇంటికి వెళ్ళినా ఏం మాట్లాడకుండా కుక్కిమంచంలో పడుకొని ఆకాశం కేసి చూస్తూ ఆలోచించసాగింది ఆదెమ్మ.

వెంకటలక్ష్మి వంటచేసి తల్లిని స్నానం చేసి రమ్మంది.

ఇద్దరూ భోజనాలు చేస్తుండగా వచ్చాడు నర్సింహ ''ఏం అక్కా బాగున్నావా?'' అంటూ.

త్వరత్వరగా భోజనం ముగించి, నర్సింహని తీసుకొని ఇంటి బయట కొచ్చి ఆ దుర్మార్గపు టి.సి. విశాఖపట్టణంలో తమ డబ్బు ఏ విధంగా లాక్కున్నాడో వివరించి భోరున విలపించింది ఆదెమ్మ.

చూసిన పాముని కన్నంలోకి పోనివ్వకుండా తన బుట్టలోకి లాక్కునే జిత్తులమారి 'పాములోడు' లాంటి వాడు ఈ టి.సి. అని, వెంకటలక్ష్మిని ఏదోవిధంగా లోబర్చుకునే ప్రయత్నాలుచేస్తాడని గ్రహించాడు నర్సింహ.

ఏదో రకంగా వెంకటలక్ష్మిని ఆ టి.సి. బారి నుండి రక్షించాలి.

''అక్కా! నువ్వు దిగులు పెట్టుకోకు. నేనుంటాను మీకు తోడు. సరేనా!'' అని ఆదెమ్మకి ధైర్యం చెప్పి వెళ్ళాడు నర్సింహ.

***

ఆదెమ్మ, తనకీ వెంకటలక్ష్మికి రాజమండ్రి నుండి విశాఖపట్టణం వరకూ నెలవారీ పాస్‌లు తీసుకుంది.

టికెట్ల గొడవలేకపోయినా ప్రయాణీకుల్ని ఇబ్బంది పెడుతున్నారంటూ అడపా, దడపా వందా, యాభై గుంజుకు పోతున్నారు టి.సి.లు


ఒకరోజు విశాఖపట్నంలో డ్యూటీ దిగి రూంలోకి వెళ్తున్న టి.సి. చక్రవర్తిని ఆపింది ఆదెమ్మ.

''ఏంటీ? టికెట్ కొనలేదా?'' అడిగాడు టిసి

''నెలవారీ పాస్‌లు కొనుక్కున్నామండి'' నెమ్మదిగా వినయంగా చెప్పింది ఆదెమ్మ.

''మరేంటి?'' అసహనంగా అడిగాడు టి.సి.

''మా అమ్మాయికి పెళ్ళి కుదిరిందండి. వచ్చే నెలలోనే పెళ్ళి. అయితే పెళ్ళికి ముందు అస్సాంలోని కామాఖ్య అమ్మవారిని దర్శించుకోవడం మా ఆచారం. కానీ నా దగ్గర అంత డబ్బులేదు. మీకు ఆ రూట్లో తెలిసున్న టి.సి. ఎవరైనా వుంటే మా అమ్మాయిని వారితో పంపుతాను. అమ్మవారిని చూసి మొక్కు చెల్లించుకొని మర్నాడు రైలుకి గౌహతిలో



ఎక్కించేస్తే విశాఖపట్నంలో నేను దింపుకుంటాను.

పేదదాన్ని. సాయంచేయండి బాబూ! మీకు చాలామంది టి.సి.లతో పరిచయాలుంటాయి కదా. గౌహతి వెళ్ళే రైలులో మా అమ్మాయికి తోడుగా ఎవరు వుంటారు అంటే మీకు చాలామంది తెలుసని చెప్పారు. మీరు ఈ సాయం చేస్తే జీవితాంతం ఋణపడి వుంటాను'' దీనంగా అడిగింది ఆదెమ్మ.

చక్రవర్తి స్పీడుగా ఆలోచించాడు. తను కన్నేసిన ముద్దమందారం కొన్ని రోజుల్లో పెళ్ళిచేసుకొని వెళ్ళిపోతుందా! అయినా అదృష్టం తన పక్షాన వుండడం వలన ఆదెమ్మ తన దగ్గరికే వచ్చింది సాయం చేయమని. విశాఖపట్నం నుండి గౌహతి 36 గంటల ప్రయాణం. అంటే రెండు రాత్రులు ఒక పగలు. ఎవరో టిసిని బతిమాలడం ఎందుకు? తనే వెళితో హాయిగా ఎంజాయ్ చేయవచ్చు. సరదా తీరిపోయాక విశాఖలో దింపవచ్చు లేదా ఏ బొంబాయిలోనో అమ్మేస్తే బోలెడు డబ్బులు.

చక్రవర్తి కళ్ళముందు అందమైన వెంకటలక్ష్మి ఆమె వెనుకే నోట్ల కట్టలు కదలాడాయి.

''సరే ఆదెమ్మా! నిన్నుచూస్తే జాలేస్తోంది. నేనే డ్యూటీ వేయించుకొని మీ అమ్మాయిని గౌహతి తీసుకువెళ్తాను. దిగులు పెట్టుకోకు.'' నర్మగర్భంగా అన్నాడు చక్రవర్తి.

ఆదెమ్మ టిసికి వంగి వంగి నమస్కారాలు చేసి వెళ్ళింది.

వారం రోజులు గడిచాక విశాఖపట్టణంలో ఓ రోజు సాయంత్రం ఆరు గంటలకు గౌహతి వెళ్ళే రైలుకి టిక్కెట్లు రిజర్వు చేసాడు చక్రవర్తి.

ఆదెమ్మ వచ్చి వెంకటలక్ష్మిని రైలు ఎక్కించింది. కన్నీళ్ళు పెట్టుకున్న వెంకటలక్ష్మిని సముదాయించింది. అదే సమయంలో వారి ముగ్గురినీ గమనిస్తూ మరొక వ్యక్తి కూడా అదే రైలు ఎక్కడం జరిగింది.

విశాఖపట్టణం నుండి గౌహతి వరకూ తనకూ, వెంకటలక్ష్మికి 'కూపే' బుక్ చేసాడు చక్రవర్తి. తన పేరు మీద, భార్య బంధువుల పేర్లు మీద రిజర్వేషన్ చేసాడు.

రాత్రి భోజనాలు చేసారిద్దరూ. వెంకటలక్ష్మితో చాలాసేపు కబుర్లు చెప్పి ఆమెలోని భయాన్ని పోగొట్టాడు చక్రవర్తి. వెంకటలక్ష్మి కూడా అతని కబుర్లకు చక్రల్లాంటి కళ్ళను కదలిస్తూ ఆసక్తిగా వినసాగింది. చాలా కాలానికి ఒక కన్నెపిల్లతో 'పొందు' కుదిరినందుకు ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యాడతను.

''రైలులో వెళుతూ వెన్నెల్లో గోదావరి చూడాలని ఎన్నోసార్లు అనుకున్నాను. కానీ మా అమ్మా చీకటి పడేసరికి ఇంటికి తీసుకు వచ్చేది. రాజమండ్రిలోనే వున్నా నా కోరిక తీరనే లేదు'' గారాలు పోతూ అంది వెంకటలక్ష్మి.

''దానిదే వుంది. అయిదు నిమిషాల్లో రైలు నది మీంచి వెళుతుంది. నేను దగ్గరుండి. నీకు చూపిస్తానుగా. ఇంకోవిషయం ఈ రోజు పౌర్ణమి. చూడు వెన్నెల ఎంత బాగుందో'' అంటూ కిటికీలోంచి ఆమెకు చెట్ల మీద పడి మెరుస్తున్న వెన్నెలను చూపించాడు చక్రవర్తి.

అప్పటికి టైము పదకొండు గంటలయ్యింది. బోగీలోని ప్రయాణీకు లందరూ నిద్రావస్థలో వున్నారు.

చక్రవర్తి, వెంకటలక్ష్మిని తీసుకొని, బోగీ తలుపు వద్దకు వచ్చాడు. తలుపుకి పైన వున్న ఇనుప చిడత తీసి తలుపు తెరిచాడు. చల్లనిగాలి రివ్వున వచ్చి వారి మొహాల్ని తాకింది.

రైలు పెద్ద శబ్దంతో నది మీద వున్న వంతెన మీద నుండి ప్రయాణిస్తోంది. ఆ వంతెనకు రైలింగులేదు. వెంకటలక్ష్మి ఒక చేత్తో ఇనుపరాడ్ పట్టుకొంది. మరొక చెయ్యి చక్రవర్తి చేతిలో వుంది.

నదిలోని నీళ్ళు వెన్నెలలో ధగధగా వెండిలా మెరుస్తున్నాయి. దూరంగా నింగిలో చందమామ వెన్నెల కురిపిస్తూ చిరునవ్వులు చిందిస్తున్నాడు. ఆ దృశ్యం చూసి వెంకటలక్ష్మి మొహం ఆనందంతో వెలిగిపోతోంది. ఆమెను చూసి చక్రవర్తి పొంగిపోతున్నాడు.

కొద్దిసేపట్లోనే ఈ అందాలరాశి తన స్వంతం కాబోతోంది. తనకి 'రెండవ సెటప్'గా వుంచేసుకుంటాడు. ఒప్పుకోకపోతే ఏదో రకంగా బొంబాయి తీసుకెళ్ళి అమ్మేస్తాడు.

అంతరాత్రి వేళ కూడా ఆ నదిలో వెన్నెల వెలుగులో ఒక చిన్ననావ కనిపించింది ఇద్దరికీ. ఆశ్చర్యంగా రైలు లోంచి ఆ నావకేసి చూస్తున్నా రిద్దరూ.

అప్పుడే అనుకోని సంఘటన ఒకటి జరిగింది.

ఏ మాత్రం చప్పుడు కాకుండా ఒక బలిష్టమైన వ్యక్తి వారి వెనుకకు చేరాడు. కన్నుమూసి తెరిచేలోగా వెంకటలక్ష్మిని కుడిచేత్తో పట్టుకొని, ఎడం చేత్తో చక్రవర్తిని బలంగా నదిలోకి తోసేసాడు.

రైలు శబ్దంలో అతనికేక కలిసి పోయింది.

వెంకటలక్ష్మి భయంగా ఆ వ్యక్తిని అల్లుకుపోయింది. అతను వెంటనే తలుపు వేసేసాడు. ఆమెని నెమ్మదిగా నడిపించుకుంటూ బోగీ చివరకు తీసుకువచ్చాడు.

రైలు తర్వాతి స్టేషనులో ఆగగానే జనరల్ బోగీలోని తన స్థానం దగ్గరకు తీసుకువచ్చాడు.

తన శృంగార లీలలకు అంతరాయం కలగకూడదని టిసిని పక్క బోగీ లోకి వెళ్ళమన్న చక్రవర్తి ''ముందు చూపు'' అతనికి చివరి చూపయ్యింది.

***

గౌహతిలోని పాన్‌బజారులో వున్న ''లక్ష్మీనరసింహ'' కేఫ్ ప్రారంభించిన ఆరు నెలలకే లాభాల బాట పట్టింది.

సరసమైన ధరలే కాకుండా రుచికరమైన ఫలహారాలు, సువాసనలు వెదజల్లే చాయ్ ఘుమఘుమలు నగర వాసుల్ని బాగా ఆకట్టుకున్నాయి.

క్యాష్ కౌంటర్లో వెంకటలక్ష్మి చిరునవ్వులు చిందిస్తూ వుండటం కూడా వ్యాపార విజయ రహస్యాలలో ఒకటిగా కష్టమర్లు చెప్పుకుంటారు.

కామాఖ్య అమ్మవారి దేవాలయ దృశ్యంతో, లక్ష్మీనరసింహ కేఫ్ అని హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషలలో వున్న బోర్డు కూడా నగర వాసుల్ని, యాత్రీకుల్ని ఆకర్షించడం విశేషం.

కేంటీన్ లోపల ఆదెమ్మ ఒక కుర్చీలో కూర్చుని పని వాళ్ళని అజమాయిషీ చేస్తూ వుంటుంది.

గౌహతిలో ఐఐటి చదివే ఆంధ్రా, తమిళనాడు విద్యార్థినీ విద్యార్థులు వారాంతంలో ప్రత్యేకంగా వచ్చి ఉప్మా, పెసరట్టు తిని వెళ్తూ వుంటారు.

ఆదెమ్మ నరసింహాని శ్రీకృష్ణుడిలా భావిస్తుంది. ద్రౌపదీ మాన సంరక్షణ చేయడమే గాక, లోక కంటకుడైన జరాసంధుడ్ని భీముడిచేత మట్టుబెట్టించిన వనితా వల్లభుడిగా శ్రీకృష్ణుడ్ని అభి మానిస్తుంది, ఆరాధిస్తుంది.

టి.సి. చక్రవర్తి 'మిస్సింగు' ఇప్పటికీ రైల్వేవారికి, కుటుంబసభ్యులకీ అంతుపట్టని విషయమే.

*

రచయిత సెలల్ నెం: **9848663735**



## రిచాది తొందరపాటా?

తొలి సినిమాతోనే సమంతా, రిచా గంగోపాధ్యాయ ఎంత ఫేమస్ అయిపోయారో అందరికీ తెలిసిందే! పెద్ద హీరోల సరసన నటించడానికి సమంతకు ఆఫర్ల మీద ఆఫర్లు వస్తుండగా, ఈ రేసులో రిచా కొద్దిగా వెనకబడిందని పలువురు అంటున్నారు. ఆ పరుగులోనే తన రెండవ సినిమా ఎంపికలో కొద్దిగా తొందరపడిందన్నది వారి వాదన. మలి సినిమాను రవితేజతో కాకుండా మరొకరితో చేయడానికి అంగీకరించి ఉంటే బాగుండేదని వారు అంటున్నారు. రవితేజ సీనియర్ నటుడే అయినా, వయసులో కుర్రహీరోలకన్నా పెద్దవాడు కావడమే ఇందుకు కారణం అని చెబుతున్నారు. ఓ నాలుగైదు సినిమాలు చేసిన తరువాత రవితేజతో చేయడానికి అంగీకరించి ఉంటే బాగుండేదని వారు అంటున్నారు.